దిగ్విజయంగా 'జగనన్నే మా భవిష్యత్తు'

- ప్రతి ఇంటా అపూర్వ స్పందన
- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- ప్రజా మద్దతు పుస్తకాల స్వీకరణ



ఎమ్మెల్యే నాగిరెడ్డికి పుస్తకాలు అందిస్తున్న 85వ వార్డు నాయకుడు ఇల్లపు ప్రసాద్



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: మా నమ్మకం నువ్వే జగన్, జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నియోజకవర్గంలో దిగ్విజయంగా పూర్తి చేశామని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. స్థానిక టీఎన్ఆర్ ఫంక్షన్ హాల్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమానికి ప్రతి ఇంటా మంచి స్పందన వచ్చిందని, 83శాతం మంది ప్రజలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మద్దతుగా నిలిచారని చెప్పారు. ఇది శుభ పరిణామమన్నారు. ఈ నెల 7న ప్రారంభించిన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, గృహ సారథులు, కన్వీనర్లు ఉత్సాహంగా పాల్గొన్నారని చెప్పారు. పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు సకాలంలో పని చేసిన నాయకులకు, కార్యకర్తలకు, గృహ సారథులు, కన్వీనర్లకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇదే ఉత్సాహంతో పని చేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ పరిధిలో ఒక్క ఇంటిని కూడా వదలకుండా డోర్ టు డోర్ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించామని తెలిపారు. ప్రభుత్వ పని తీరుపై ప్రజలంతా సంతృప్తిని వ్యక్తం చేశారన్నారు. అవినీతి రహిత ప్రభుత్వంగా వైఎస్సార్ సీపీని ప్రజలు అభివర్ణించారని చెప్పారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, భూపతిరాజు సుజాత, మహ్మద్ ఇమ్రాన్, ఉరుకూటి చందు, క్లస్టర్ ఇన్‌చార్జులు కులుకూరి మంగరాజు, ఎండీ గౌస్, నాయకులు పల్లా చినతల్లి, మార్టుపూడి పరదేశి, దొడ్డి రమణ, కోమటి శ్రీనివాసరావు, ధర్మాల శ్రీను, సిరట్ల వాసు, గొందేశి వెంకటరమణారెడ్డి, మహేశ్వర రెడ్డి, కొయ్య భారతి, మద్దాల అప్పారావు, రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నాగిరెడ్డికి ప్రజా మద్దతు పుస్తకాలను అందిస్తున్న 86వ వార్డు నాయకులు

కోక్‌ఓవెన్‌లో భద్రతా చర్యల పరిశీలన

- పలు సెక్షన్లను సందర్శించిన విభాగాధిపతి మిశ్రా



ఉక్కు కోక్‌ఓవెన్‌లో పర్యటిస్తున్న విభాగాధిపతి మిశ్రా, నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కోక్‌ఓవెన్ భద్రతా చర్యలను విభాగాధిపతి ఎ.కె.మిశ్రా శనివారం పరిశీలించారు. అధికారులు, కార్మిక సంఘాల నాయకులతో కలిసి పాదయాత్రగా వెళ్లిన ఆయన పలు సెక్షన్లను పరిశీలించి, అక్కడి భద్రతా చర్యలను ప్రత్యక్షంగా తిలకించారు. ఉద్యోగులకు పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికుల భద్రతకు యాజమాన్యం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. బీఆర్‌పీ సెక్షన్ జీఎం డాక్టర్ రవికుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో అధికారులు ఎస్.కె. రౌత్, బి.టి. నాయక్, జి.బి. శ్రీనివాస్, కార్మిక నాయకులు కొమ్ము ప్రసాదరావు, తాండ్ర కనకరాజు, కె. ఆనందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఇండస్ట్రియల్ ఎక్స్‌పో



ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐలా చైర్మన్ సత్యనారాయణ రెడ్డి

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్ డీ బ్లాక్‌లోని గోపాల్ ఇంజినీరింగ్, సరిపల్లి గ్రాండ్‌లో ఏర్పాటు చేసిన ఇండస్ట్రియల్ కం బిజినెస్ ఎక్స్‌పో–2023 శనివారం సాయంత్రంతో ముగిసింది. ఫ్లవరిష్ క్రియేషన్ యజమాని డి.వినోద్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఎక్స్‌పోలో పలు పారిశ్రామిక ఉత్పత్తులతో పాటు ఫుడ్, మిల్లెట్స్ తదితర స్టాళ్లు కొలువుదీరాయి. ఎక్స్‌పోలో మూడో రోజు వివిధ అంశాలపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఐలా చైర్మన్ కె.సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతంలో ఇలాంటి ఎక్స్‌పో నిర్వహించిన వినోద్‌ను అభినందించారు. అనంతరం వినోద్ దంపతులు పారిశ్రామిక వేత్తలను సత్కరించి, జ్ఞాపికలను బహూకరించారు. కార్యక్రమంలో మిమిక్రీ, ఆర్కెస్ట్రా, మ్యాజిక్ షో అలరించాయి. కార్యక్రమంలో ఐలా మాజీ చైర్మన్లు వై.సాంబశివరావు, శేషగిరిరావు, ఐలా కార్యదర్శి చీకటి సత్యనారాయణ, వాసీవా కోశాధికారి బి.ఎస్.రావు, సీనియర్ పారిశ్రామిక వేత్తలు శివయ్య, రాంబాబు తదితరులు పాల్గొన్నారు. పలు కళాశాలల నుంచి అధికసంఖ్యలో వచ్చిన విద్యార్థులు ఎక్స్‌పోను సందర్శించారు.

క్లుప్తంగా

16 మందికి ఉద్యోగాలు



సర్టిఫికెట్లతో విద్యార్థులు

సింహాచలం: పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్ హబ్ మొదటి బ్యాచ్ వీడ్కోలు సభ శనివారం ఘనంగా జరిగింది. నాలుగు నెలలపాటు పాలిటెక్నిక్‌లో ఇండస్ట్రియల్ కోర్సులో శిక్షణ పొందిన 28 మందికి ఏపీఎస్ఎస్‌డీసీ నుంచి ధ్రువీకరణ పత్రాలను ఆటోనగర్‌లోని ఎలక్ట్రికల్ ఆటోమేషన్ ఎండీ రమ్యశ్రీ , డైరెక్టర్ రమాకాంత్ అందజేశారు.శిక్షణ తీసుకున్న 28 మందిలో 16 మంది విశాఖపట్నంలోని పలు పరిశ్రమల్లో ప్లేస్‌మెంట్ పొందినట్టు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, కేవీఎస్.సుబ్రహ్మణ్యేశ్వరరావు, కోఆర్డినేటర్ బి.సౌజన్య పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టర్ తరుణ్‌కు సన్మానం



తరుణ్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: ఢిల్లీలో జరగనున్న వెయిట్ లిఫ్టింగ్–2023 కామన్‌వెల్త్ సెలక్షన్ ట్రయల్, కోచింగ్ క్యాంప్‌నకు ఎంపికైన ఎం.తరుణ్‌ను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అభినందించారు. కోచ్ డాక్టర్ ఎస్.రాజారావు ఆధ్వర్యంలో తరుణ్‌ను సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలపై ఆసక్తి ఉన్నవారికి తగిన ప్రోత్సాహం అందిస్తామన్నారు. కార్యక్రమంలో 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, నాయకులు మార్టుపూడి పరదేశి, గొందేశి సత్యారావు, గంట్యాడ గురుమూర్తి, పిట్టా రెడ్డి, పూజారి శైలజ, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

86వ వార్డులో ఆధార్ సెంటర్



ఆధార్ సేవలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కోటేశ్వరరావు

కూర్మన్నపాలెం : జీవీఎంసీ 86వ వార్డు కూర్మన్నపాలెంలోని కమ్యూనిటీ హాల్లో ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌ను కార్పొరేటర్ లేళ్ల కోటేశ్వరరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలకు అధార్ కార్డును అనుసంధానం చేస్తున్నందున ప్రతి ఒక్కరూ ఆధార్‌లో ఎటువంటి మార్పులు ఉన్నా చేసుకోవాలని సూచించారు. వార్డులో ఏర్పాటు చేసిన ఆధార్ సేవలను ప్రజలందరు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కర్రి ఈశ్వరరావు, రాజాన నాయుడు, రమణ, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ రోడ్‌లో అభివృద్ధి పనుల పరిశీలన



డివైడర్ పనులను పరిశీలిస్తున్న దేవన్‌రెడ్డి తదితరులు

గాజువాక : బీసీ రోడ్‌లో నూతనంగా నిర్మిస్తున్న డివైడర్లు, సెంట్రల్ పోల్ విద్యుత్ స్తంభాల పనులను వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి శనివారం పరిశీలించారు. 66వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్‌తో కలిసి ఈ పనులను పరిశీలించిన అనంతరం అధికారులతో మాట్లాడారు. అభివృద్ధి పనులను పూర్తి చేయడంలో జాప్యం లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎండీ గౌస్, స్థానిక నాయకులు పేరం రామకృష్ణారెడ్డి, పెదిరెడ్ల ఈశ్వరరావు, దేముడుబాబు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రానికి కనువిప్పు కలిగేవరకు ఉక్కు ఉద్యమం

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ సంస్థలపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు సరికాదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగే వరకు ఉక్కు ఉద్యమం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద కొనసాగుతున్న రిలే దీక్షలు శనివారం నాటికి 807వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్ష శిబిరంలో క్యూఏటీడీ, ఇన్‌స్ట్రుమెంటేషన్, ఆర్ అండ్ డీ, ఈటీఎల్ విభాగ ప్రతినిధులు, కార్మికులు కూర్చున్నారు. వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమను రక్షించుకోవడం కోసం కార్మిక వర్గం ఎలాంటి త్యాగాలకైనా సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



దీక్షలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

ఎల్ఐసీ అధికారుల తీరుపై ఫిర్యాదు

అగనంపూడి: ఎల్ఐసీ గాజువాక బ్రాంచ్ అధికారుల తీరుపై ఢిల్లీలోని ప్రధాన కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు వినియోగదారుల హక్కుల పరిరక్షణ సమితి కన్వీనర్ పట్టా రామ అప్పారావు తెలిపారు. పాలసీదారులు వివిధ కారణాలతో పాలసీ బాండ్లు, ధ్రువ పత్రాలను కార్యాలయంలో ఇస్తున్నా రసీదు ఇవ్వడం లేదని, రిజిస్టర్‌లో నమోదు చేయడం లేదని ఆరోపించారు. ఇటీవల ఒక పాలసీదారు మరణిస్తే నామినీలు పత్రాలు, బాండ్లు సమర్పించినా.. రసీదు ఇవ్వలేదని తెలిపారు. రెండు నెలలు కావస్తున్నా క్లెయిమ్ పూర్తి చేయకపోగా.. పత్రాలు ఇవ్వలేదని అధికారులు వాదిస్తుండడంతో నామినీ గగ్గోలు పెడుతున్నారని తెలిపారు. దీనిపై ప్రధాన కార్యాలయంలో ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు.

సంక్షేమ సారథి సీఎం జగన్



దివ్యాంగుడికి సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: కుల, మత, రాజకీయాలకు అతీతంగా, అర్హతే ప్రాతిపదికగా పథకాలను అమలు చేస్తున్న సంక్షేమ సారథి సీఎం జగన్‌మోహన్ రెడ్డి అని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 69వ వార్డు కాంపుతుంగ్లాంలో శనివారం ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులను కలుసుకుని, పథకాలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతీ వార్డులో రోడ్లు, కాలువలు, మంచినీటి సమస్యలు లేకుండా సంబంధిత అధికారులతో పర్యవేక్షిస్తున్నానన్నారు. వార్డు అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్ రెడ్డి, విరోతి రాము, కాకి అప్పల రెడ్డి, సాలాపు వెంకటరావు, తమడాల కృష్ణంరాజు, అంగ బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

గాజువాక : మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేయాలని గాజువాక ఎస్ఐ నజీర్ సూచించారు. స్థానిక సీఎల్‌సీ మినిస్ట్రీస్ అధినేత బిషప్ సుధీర్ మహంతి ఆధ్వర్యంలో 60 మంది మహిళలకు కుట్టు మిషన్లను శనివారం పంపిణీ చేశారు. మినిస్ట్రీస్ అధినేత మహంతి మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకుడు పప్పు రాజారావు, హోటల్ ఎస్‌బీటీ యజమాని మహ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి శనివారం చిన్నారులకు అన్నసమారాధన

అక్కిరెడ్డిపాలెం: అయ్యప్ప దేవాలయ సమితి ఆధ్వర్యంలో శబరి విద్యానికేతన్ చిన్నారులకు ప్రతీ శనివారం అన్నప్రసాదం అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అభినందించారు. సమితి నిర్వహించే కార్యక్రమాల్లో తన వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. షీలానగర్ అయ్యప్ప స్వామి ఆలయంలో కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన, చిన్నారులకు అన్నప్రసాదం అందజేశారు. అయ్యప్ప దేవాలయ సమితి చైర్మన్ ఎస్.ఎ.నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కార్యదర్శి పి.వి.శేషగిరిరావు, సంయుక్త కార్యదర్శి వి.రావు, కోశాధికారి ఆళ్ల అప్పారావు, సభ్యులు పాల్గొన్నారు.



చిన్నారులకు భోజనం అందజేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

ఆకట్టుకున్న విద్యార్థుల నృత్య ప్రదర్శనలు

అగనంపూడి: అంతర్జాతీయ నృత్య దినోత్సవం సందర్భంగా దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన నృత్య పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సుమారు రెండు వందల మంది విద్యార్థులు వివిధ నృత్య రీతులు ప్రదర్శించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలతో పాటు సామాజిక స్పృహ ఉట్టిపడేలా నృత్యాలు ప్రదర్శించిన విద్యార్థులను రెక్టార్ వి.మధుసూదనరావు అభినందించారు. ఉత్తమ ప్రదర్శనలకు బహుమతులు అందించారు. ప్రిన్సిపాల్ జె.సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ పి.ఎస్.రవీంద్ర, డీన్లు సతీష్, హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ న్యాయవాది లింగంపల్లి మృతి



శ్రీనివాస సత్యనారాయణ (ఫైల్)

అల్లిపురం/గాజువాక: సీనియర్ న్యాయవాది లింగంపల్లి శ్రీనివాస సత్యనారాయణ శనివారం మధ్యాహ్నం మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఎన్‌బీఎం న్యాయకళాశాల పూర్వ విద్యార్థి అయిన ఆయన 29 సంవత్సరాలుగా న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్నారు. ఎన్‌బీఎం న్యాయకళాశాల విద్యార్థి నాయకుడిగా, గాజువాక న్యాయవాదుల సంఘం అధ్యక్షునిగా సేవలందించారు. ఆయన ఆకస్మిక మృతిపై జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.గోపి సంతాపం వ్యక్తం చేశారు. విశాఖ న్యాయవాదుల సంఘం, రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు కె.రామజోగేశ్వరరావు, కౌన్సిల్ సభ్యులు పి.నరసింగరావు, ఎస్.కృష్ణమోహన్, బైపా అరుణ్‌కుమార్, గీతం కళాశాల అధ్యాపకులు ఆచార్య రాఘవయ్య, అనితా రావు, ఎన్‌బీఎం న్యాయకళాశాల అధ్యాపకులు డీవీ రమణ, విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చింతపల్లి రాంబాబు, పైలా శ్రీనివాసరావు, గాజువాక న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కేవీ స్వామి సంతాపం తెలిపారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌కు సహకరించండి



మాట్లాడుతున్న కార్పొరేటర్ వంశీరెడ్డి

పెదగంట్యాడ: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో విశాఖను నంబర్ వన్‌గా నిలిపేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి అన్నారు. వార్డు పరిధిలోని దయాల్‌నగర్‌లో జెడ్సీ సింహాచలం ఆధ్వర్యంలో స్వచ్ఛ సర్వేక్షణ్‌పై శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ శుభ్రత పాటిస్తే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చన్నారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు పనిముట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంవోహెచ్ డాక్టర్ కిరణ్‌కుమార్, ఏఈ వెంకటరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నర్సింగరావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఎన్.వై. నాయుడు, బొడ్డు గోవిందు, వెంపాడ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్కా ఫౌండేషన్ చేయూత ..ఆర్కా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆకాంక్ష కార్యక్రమంలో భాగంగా నాలుగో తరగతి చదువుతున్న ఓ విద్యార్థికి ఆర్థిక సాయం చేశారు. దయాల్‌నగర్‌లో నివాసం ఉంటున్న పొలిశెట్టి శ్రీను ఇటీవల మృతి చెందడంతో, అతడి కుమారునికి రూ.22,968 నగదును కార్పొరేటర్ వంశీరెడ్డి, జెడ్సీ సింహాచలం చేతుల మీదుగా అందజేశారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

- డీఈవో చంద్రకళ
- విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డుల పంపిణీ

గాజువాక : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా విజయం సాధిస్తున్నారని జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ అన్నారు. గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు శనివారం ఆమె ప్రోగ్రెస్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాలలో కలుసుకుని, వారితో కొద్దిసేపు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న సేవలు, అందుబాటులో ఉన్న సౌకర్యాలను వివరించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ అదనపు ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ బి.శ్రీనివాస్, పాఠశాల హెచ్ఎం పి.అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రోగ్రెస్ కార్డులను పంపిణీ చేస్తున్న డీఈవో చంద్రకళ

జూన్ 9న లోక్ అదాలత్



సమావేశంలో పాల్గొన్న న్యాయమూర్తులు

గాజువాక : గాజువాక కోర్టు కాంప్లెక్స్‌లో జూన్ 9న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌పై న్యాయమూర్తులు శనివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్రీవిద్య మాట్లాడుతూ మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ అదాలత్‌ను విజయవంతం చేసేందుకు న్యాయవాదులు కృషి చేయాలని కోరారు. గాజువాక కోర్టుల పరిధిలో గల పెండింగ్ కేసులను రాజీ ద్వారా పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు ఇ.రాజేంద్రబాబు, వై.శ్రీలక్ష్మి, ఎం.ప్రేమలత, గాజువాక బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కె.వి.స్వామి, బీవీఎం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రజకుల సమస్యల పరిష్కారానికి వినతి

అక్కిరెడ్డిపాలెం: రజకుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నాతయ్యపాలేనికి చెందిన బంగారుమాంబ రజక సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యే నాగిరెడ్డికి శనివారం వినతిపత్రం అందించారు. ధోబీఖానాకు మరమ్మతులు చేపట్టాలని, కమ్యూనిటీ హాల్ నిర్మించాలని, విద్యుద్దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జిల్లా రజక సంఘం అధ్యక్షుడు తోకాడ రాము, స్థానిక రజక సంఘం అధ్యక్షుడు జామి నాగేశ్వరరావు తదితరులున్నారు.

బాలల హక్కుల పరిరక్షక నగరంగా విశాఖ

దొండపర్తి: అందరి సహకారంతో బాలల హక్కుల పరిరక్షక నగరంగా విశాఖను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సీఎం త్రివిక్రమ్‌వర్మ తెలిపారు. ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం శనివారం సీపీని మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలో బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, పోక్సో కేసులు, విద్యా సంస్థల పరిసరాల్లో మత్తు పదార్థాల సరఫరా వంటి అంశాలపై చర్చించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ పోలీస్ అధికారులు, సిబ్బందితో పాటు వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శులకు బాలల హక్కులు, చట్టాలపై సమగ్ర శిక్షణ ఇస్తామన్నారు. సీపీని కలిసిన వారిలో లవకుశ ఉన్నారు.



సీపీ త్రివిక్రమ్‌వర్మకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న గొండు సీతారాం

ఎయిమ్స్–నర్సింగ్ ఆఫీసర్స్ పరీక్షకు శిక్షణ

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ కిమ్స్ ఐకాన్‌లోని బొల్లినేని మెడ్‌స్కిల్స్ నందు ఎయిమ్స్–నర్సింగ్ ఆఫీసర్స్ పరీక్షకు శిక్షణ ఇస్తున్నట్లు ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్.నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 1వ తేదీ నుంచి ప్రారంభమయ్యే శిక్షణకు బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం కోర్సులు పూర్తి చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. ఇంటర్ పాసైన విద్యార్థులకు 9 బీఎస్సీ పారామెడికల్, బీఎస్సీ నర్సింగ్, బీపీటీ, ఎంఎల్‌టీ, జీఎన్ఎం, 14 డిప్లొమా పారామెడికల్ కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయని తెలిపారు. వివరాలకు 8247656581, 7680945357 నంబర్లలో లేదా కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలోని తమ క్యాంపస్‌లో సంప్రదించాలని కోరారు.

వివాహిత అదృశ్యం

కూర్మన్నపాలెం: వివాహిత అదృశ్యంపై దువ్వాడ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలివి.. ఫార్మాసిటీలో పనిచేస్తున్న కండిపల్లి కృష్ణ భార్య పావని(19), 16 నెలల కుమార్తె కీర్తిశ్రీతో అగనంపూడి దరి చిట్టివానిపాలెంలో నివసిస్తున్నారు. ఈ నెల 28వ తేదీ రాత్రి కృష్ణ నైట్ డ్యూటీకి వెళ్లిన సమయంలో పావని ఇంటి నుంచి వెళ్లిపోయింది. వెదికినా ఫలితం లేకపోవడంతో పావని తండ్రి రాముని నాయుడు దువ్వాడ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

జేఈఈ మెయిన్స్‌లో శ్రీ చైతన్య ప్రతిభ

గాజువాక : జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో స్థానిక శ్రీచైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. గాజువాక, స్టీల్‌ప్లాంట్ క్యాంపస్‌లకు చెందిన పలువురు విద్యార్థులు వివిధ కేటగిరీలలో ఆలిండియా స్థాయిలో ఉత్తమ ర్యాంకులను సాధించారు. టి.పూజశ్రీ (41), పి.లుతిక్ రోషన్ (171), జె.మణికంఠ (266), బి.నాగేంద్ర జశ్వంత్ (329), జి.క్రాంతి ఫణీంద్రరెడ్డి (568), బి.వి శాల్ (1322), సి.రోహిత్ (1990), పి.నితిన్ (2052), కొణతాల కుసుమ అక్షయ (2517)తో పాటు మరో ముగ్గురు 5వేల లోపు ర్యాంకులను, మరో పది మంది పదివేల లోపు ర్యాంకులు సాధించినట్లు పేర్కొన్నారు. కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు.

ఎంపీ కృష్ణయ్యను కలిసిన ఓబీసీ నాయకులు



ఎంపీ కృష్ణయ్యకు వినతిపత్రం అందజేస్తున్న ఓబీసీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఓబీసీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని స్టీల్‌ప్లాంట్ ఓబీసీ నాయకులు, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి నెల్లి అప్పలరాజు కోరారు. శనివారం అనకాపల్లి పర్యటనకు విచ్చేసిన రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యను కలిసి, ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో గళం వినిపించాలని కోరారు. కార్యక్రమంలో ఓబీసీ నాయకులు కర్రి రామలింగస్వామి, వనమ నాగేశ్వరరావు, నల్లి చంద్రశేఖర్, సీతిని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.